# సత్యవాక్కు

# The Word of Truth

# సువార్త కూటములు

కృష్ణా జిల్లా మైలవరం తాలూకా స్థానిక క్రీస్తు సంఘముల ఆధ్వర్యమున జరుపబడుచున్న సువార్త కూటములు

## 1984 ఏప్రిల్ 24 నుండి 27 వరకు

స్థలం : మైలవరం

(P. శ్రీనివాసరావుగారి పెద్దమిల్లు ఆవరణలో)

ప్రసంగీకులు : 1) **Bro.** జాషువా కూటం, కాకినాడ
(సత్యవాణి రేడియో ప్రసంగికులు)

2) **Bro. Ch.** జేకబ్, బెంగుళూరు

3) **Bro.** ఆలెన్ జేకబ్, కెనడా

మరియు అనుభవం గల సువార్తికులు ప్రసంగించెదరు.

సత్యవాక్యము నందాసక్తిగల వారందరు ఆహ్వానింపబడుచున్నారు. దూరప్రాంతములనుండి వచ్చువారికి ఉచిత భోజన వసతి సౌకర్యములు కలవు. వివక్షత లేక అందరు రావలెనని మనవి.

వివరములకు :

P. అహరోను
క్రీస్తు సంఘం
మైలవరం - 521 230

రాజన్ ఎలక్ట్రిక్ ప్రెస్, కాకినాడ.

# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక

పోస్ట్ బాక్స్ - **80,** కాకినాడ - **533 001**

ఎడిటర్ :
జె. సి. ఛోట్

మేనేజింగ్ ఎడిటర్ :
జాషువా గూటం

సంచిక **9** ఏప్రిల్ **1984** సంపుటి **4**

# సంపాదకీయము

## నోవహు ఓడ మరియు సంఘము

*(The Ark and the Church)*

బైబిలులో రెండు ముఖ్య భాగములున్నాయి; అవి పాత నిబంధన, క్రొత్త నిబంధన. మొదట పాతనిబంధన ఈయబడింది. అయితే క్రొత్త నిబంధన ఈయబడిన తరువాత పాత నిబంధన ఒక చట్టముగా అమలులో లేకుండా పోయింది (హెబ్రీ 10 : 9, 10). ఒక చట్టమువలె అది అమలులో లేకపోయినను అది ఇంకను దేవుని వాక్యమే. అది మానవుని చరిత్రను, రాబోవు క్రీస్తును గూర్చిన ప్రవచనాలను, మానవులు దేవునికి విధేయులైనప్పుడెట్లు ఆశీర్వదించబడినారో, అవిధేయులైనప్పుడెట్లు శిక్షించబడినారో యను ఉదాహరణలను మనకు బోధించుచున్నది.

మరల పాతనిబంధనలో ఛాయలుంటే నిజస్వరూపాలు క్రొత్త నిబంధనలో కనబడతాయి. ఇంకో మాటలో ఈ రెంటిలోను సమరూపాలున్నాయి. ఇటువంటి సందర్భాన్ని ఒక దానిని మనం ఇప్పుడు

కొంతమట్టుకు చూద్దాం. అది నోవహు ఓడ మరియు సంఘము. నోవహు నుండి అతడు నిర్మించిన ఓడనుండి మనం యేమి నేర్చుకోగలమని నీవనుకోవచ్చును. నిజానికి ఆ ఓడయొక్క నిజస్వరూపమైన సంఘాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే నీవు ఆశ్చర్యపడవచ్చును.

మొదటిగా ఓడనుగూర్చి కొంత తెలిసికొందము. భూమిమీద నరులయొక్క చెడుతనము గొప్పదని, వారి దుర్మార్గత దినదినము పెరుగుచున్నదని దేవుడు చూచినట్లు ఆదికాండము 6వ అధ్యాయంలో మనము కనుగొనగలము. తత్ఫలితంగా మానవుని చేసినందుకు దేవుడు సంతాపము చెందాడు. భూమిమీద లేకుండా మానవుని నాశనం చేయాలనుకొన్నాడు. అయితే నోవహు నీతిమంతుడైనట్లు దేవుడు కనుగొన్నాడు. గనుక యెహోవా దృష్టిలో అతడు కృప పొందిన వాడయ్యాడు. యిది నోవహును గూర్చియే కాదుగాని, అతని భార్య వారి ముగ్గురు కుమారులు, వారి భార్యలుకూడ అట్లే కృప పొందారు. "భూలోకము దేవుని సన్నిధిని చెడిపోయి యుండెను; భూలోకము బలాత్కారముతో నిండియుండెను. దేవుడు భూలోకమును చూచి నప్పుడు అది చెడిపోయి యుండెను; భూమిమీద సమస్త శరీరులు తమ మార్గమును చెరిపివేసుకొని యుండిరి. దేవుడు నోవహుతో - సమస్త శరీరుల మూలముగా భూమి బలాత్కారముతో నిండియున్నది గనుక నా సన్నిధిని వారి అంతము వచ్చియున్నది; ఇదిగో వారిని భూమితో కూడ నాశనము చేయుదును" అని చెప్పినట్లు బైబిలులో రికార్డు చేయ బడింది (ఆది 6:11-13).

ఇంకా, దేవుడు నోవహుతో ఇట్లు చెప్పాడు: "చితిసారకపు మ్రానుతో నీ కొరకు ఓడను చేసికొనుము. అరలు పెట్టి ఆ ఓడను చేసి లోపటను వెలుపటను దానికి కీలు పూయవలెను. నీవు దాని చేయవలసిన విధమిది: ఆ ఓడ మూడు వందల మూరల పొడుగును ఏబది మూరల వెడల్పును ముప్పది మూరల యెత్తును గలదై యుండ

వలెను. ఆ ఓడకు కిటికీచేసి పైనుండి మూరెడు క్రిందికి దాని ముగించవలెను; ఓడతలుపు దాని ప్రక్కను ఉంచవలెను. క్రింది అంతస్థు, రెండవ అంతస్థు, మూడవ అంతస్థు గలదిగా దాని చేయవలెను. ఇదిగో నేనే జీవ వాయువుగల సమస్త శరీరులను ఆకాశము క్రింద నుండకుండ నాశనము చేయుటకు భూమి మీదికి జల ప్రవాహము రప్పించుచున్నాను. లోకమందున్న సమస్తమును చనిపోవును; అయితే నీతో నా నిబంధన స్థిరపరచుదును. నీవును నీతోకూడ నీ కుమారులును నీ భార్యయు నీ కోడండ్రును ఆ ఓడలో ప్రవేశింపవలెను. మరియు నీతోకూడ వాటిని బ్రదికించి యుంచుకొనుటకు సమస్త జీవులలో అనగా సమస్త శరీరులయొక్క ప్రతి జాతిలోనివి రెండేసి చొప్పున నీవు ఓడలోనికి తేవలెను; వాటిలో మగదియు ఆడుదియు నుండవలెను. నీవు వాటిని బ్రదికించి యుంచుకొనుటకై వాటివాటి జాతుల ప్రకారము పక్షులలోను, వాటివాటి జాతుల ప్రకారము జంతువులలోను, వాటివాటి జాతుల ప్రకారము నేలను ప్రాకు వాటన్నిటిలోను ప్రతి జాతిలో రెండేసి చొప్పున నీ యొద్దకు అవివచ్చును. మరియు తినుటకు నానావిధములైన ఆహార పదార్థములను కూర్చుకొని నీదగ్గర ఉంచుకొనుము; అవి నీకును వాటికిని ఆహారమగునని చెప్పెను. నోవహు అట్లు చేసెను, దేవుడు అతని కాజ్ఞాపించిన ప్రకారము యావత్తు చేసెను" (ఆది 6:14-22).

దుర్మార్గ లోకంపైకి జలప్రళయాన్ని దేవుడు రప్పించాడు. అయినను దానికి మున్నెన్నడు భూమిపై వర్షింపలేదు. నోవహు ఓడను తయారు చేయుచున్నప్పుడు జలప్రళయాన్ని గూర్చి బోధించినప్పుడు ప్రజలు తప్పక నవ్వారు, హేళనచేసి యుండేవారు. అయినను నోవహు తన కృషిని విరమించలేదు. చివరిగా, అన్నీ సంసిద్ధమైన రోజు ఒకటి వచ్చింది. నోవహు, తన కుటుంబస్థులు, ఆయా జంతువులు ఆ ఓడలోకి ప్రవేశించాలని దేవుడు ఆదేశించాడు. ఈ అసాధారణమైన సంఘటనను చూడడానికి స్థానిక ప్రజలు, దూరప్రాంత

ముల ప్రజలు వచ్చేయుందురు. వారిదంతా చూచి గేలీచేసి యుందురు. చివరిగా ఓడ తలుపు మూయబడింది. అప్పుడు వర్షం కురియ నారంభించింది. అది ఎడతెరిపి లేకుండా కురిసింది. అంతేకాదు మహాగాధ జలముల ఊటలన్నియు తెరువబడ్డాయి. అంటే పైనుండి నీరు పడడమే కాక, క్రిందనుండియు అది పైకిలేచింది. ఇదేదో వింతైన సంఘటన యని ప్రజలు మొదట అనుకొని యుండవచ్చును. గాని నలువది దివారాత్రిలు మట్టుకు వర్షం కురిసింది. నీటిమట్టం పైకి లేచేకొలదీ ప్రజలు ఎత్తయిన ప్రదేశములకు పారిపోయి యుందురు. అయితే వర్షం కురిసే కొలదీ ఇక ఎత్తయిన ప్రదేశములు లేకపోయాయి. నోవహును అతని ఓడను చూచి హేళన చేసినవారి గతి యేమయ్యింది? ఓడయొక్క తలుపు వారికి మూయబడింది. ఇప్పుడు జలప్రళయంలో వారు మరణించడానికి విడువబడ్డారు. దీనినంతటినీ నీవు ఆదికాండము 7వ అధ్యాయంలో చదువగలవు.

నోవహుకు అతని కుటుంబానికి ఆ ఓడకు యేమి జరిగింది? వారంతా క్షేమంగా యుండిరి. దుర్మార్గులను తమ అవిధేయతను బట్టి జలప్రళయం నాశనం చేసింది. అయితే నీతిమంతులను రక్షించుట కొరకు అది ఓడను పైకెత్తింది. "నూట ఏబది దినముల వరకు నీళ్ళు భూమిమీద ప్రచండముగా ప్రబలెను" అని వ్రాయబడి యున్నది (ఆది 7:24). కడకు నీరు తగ్గడం ప్రారంభించింది. ఆరిన నేల ఏమైనా యుందో లేదో తెలిసికొనడానికి నోవహు ప్రయత్నించాడు. చివరిగా ఓడలోనుండి విడువబడిన పావుర మొకటి ఒలీవ ఆకును పట్టుకొని వచ్చింది. ఏడు దినముల తరువాత మరల దానిని విడిస్తే అది తిరిగి రాలేదు. దీనినిబట్టి నీరు సంపూర్తిగా యింకిపోయెనని నోవహు గ్రహించాడు. అప్పుడు నోవహు, అతని కుటుంబము, ఓడలోని జంతువులన్నియు ఓడలోనుండి బయటకు రాగలిగాయి. వెంటనే దేవుని ఆరాధించు నిమిత్తం, వారిని రక్షించినందుకు ఆయనకు కృత

జ్ఞత చెల్లించు నిమిత్తం నోవహు ఒక బలిపీఠమును కట్టి దేవునికి దహనబలి అర్పించాడు. ఇప్పుడు భూమి మరల పవిత్రమును పరిశుద్ధం చేయబడింది. నోవహు సంతతికి ఇది మరియొక నూతన ఆరంభం.

నోవహును అతని కుటుంబాన్ని రక్షించగలిగిం దేమిటంటే దేవుడాజ్ఞాపించిన యావత్తును చేయడానికి వారు విధేయులయ్యారని మనస్సునందుంచుకొనుము. ఓడయొక్క కొలతలను దేవుడు నోవహుకు చెప్పుచున్నప్పుడతడు విని యేమి ప్రశ్నించక వాటికి లోబడ్డాడు. చితిసారకపు మ్రానును వినియోగించాలని చెప్పబడితే దాన్ని అతడు మార్చలేదు. దాని ప్రక్కనొక ద్వారముంచాలి అన్నప్పుడు అతడు మరికొన్ని ద్వారాలను కలుపలేదు. ఆ జంతువులన్నిటినీ ఒకే ద్వారము గుండా ప్రవేశింపజేయడం కష్టం అని అనుకోవచ్చు. అయితే అది సాధ్యమే కాకుండా దేవుడు చెప్పినట్లు చేయబడింది.

ఇప్పుడు క్రొత్త నిబంధనలో ఆ ఓడయొక్క నిజ స్వరూపమైన సంఘాన్ని కొంతమట్టుకు చూద్దాం. దుర్మార్గత, పాపముతో నిండి యున్న లోకంలోకి క్రీస్తు వచ్చాడు. తన సంఘాన్ని కట్టుదునని ఆయన వాగ్దానం చేసాడు. రక్షింపబడిన వారందులో యుందురు. ఆ సంఘ ఆగమనాన్ని గూర్చి సిద్ధపరుస్తూ ఆయన ఉపదేశించాడు, తన అపొస్తలులకు ఆదేశాలిచ్చాడు (మత్తయి 16 : 18, 19). యేసు సిలువ వేయబడి, సమాధి చేయబడి పునరుత్థానుడైన తరువాత పై నుండి శక్తి పొందేవరకు అపొస్తలులు యెరూషలేములో కనిపెట్టాలని ఆయన చెప్పాడు. వారాయనకు యూదయ సమరయ దేశములలోను భూదిగంతముల వరకు సాక్షులై యుందురని ఆయన చెప్పాడు (అపొ.కా. 1:8). వారట్లు చేసారు. పరిశుద్ధాత్ముడు వారిపైకి వచ్చాడు, వారు క్రీస్తు మరణ సమాధి పునరుత్థానములను గూర్చిన సువార్తను బోధించారు. ఇంచుమించు మూడువేలమంది క్రీస్తునందు విశ్వసించి, తమ పాపముల విషయమై మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తం

బాప్తిస్మం పొందారు. వారు పరిశుద్ధాత్మ అను వరమును పొందారు. వారిని ప్రభువు తన సంఘముతో చేర్చాడు. అప్పటినుండి క్రైస్తవ్యము ప్రపంచమంతటికీ వ్యాప్తి చేయబడింది.

గనుక సంఘము అనేక విషయాల్లో నోవహు ఓడవలె యున్నది. నోవహును అతని కుటుంబాన్ని రక్షించడానికి దేవుడు ఓడను సిద్ధపరచాడు. పాపమునుండి నిత్యనాశనమునుండి క్రీస్తుకు విధేయులైన వారు రక్షింపబడు నిమిత్తము ఆయన సంఘాన్ని స్థాపించాడు. ఓడ ఎట్లు నిర్మింపబడాలో దాని మాదిరి నంతటినీ దేవుడిచ్చాడు. ప్రభువు సంఘముయొక్క రూపురేఖలన్నిటినీ క్రొత్త నిబంధన ఇచ్చుచున్నది. ఈ మాదిరి ననుసరించి ఎక్కడైతే సంఘము లేదో అక్కడ ఆదిమ సంఘాన్ని మనం నెలకొల్పవచ్చును. ఓడకు ఒకేఒక్క ద్వారమున్నది. సంఘానికి కూడ అంతే. ఆయనే ఆ ద్వారాన్నని క్రీస్తు చెప్పుచున్నాడు. పరలోకానికి వెళ్ళే ద్వారం అది ఒక్కటి మాత్రమే (యోహాను 10:9; 14:6). ఓడలో ప్రవేశించడానికి ప్రజలు పాతలోకాన్ని వెనుక వదిలివేయాలి. ఈనాడు సంఘంలో ప్రవేశించడానికి ప్రజలు తమ పాపముల విషయమై మారుమనస్సు పొందాలి (అపొ. కా. 17 : 30). పురాతన కాలమునాటి ప్రజలు నీటిద్వారా రక్షింపబడ్డారు. నీటిపై ఓడ తేలినందున ఓడలోనున్న వారు జలప్రళయంనుండి రక్షింపబడ్డారు. నేడు ప్రజలు రక్షింపబడాలంటే, తమ పాపములు కడుగబడాలంటే బాప్తిస్మపు నీటిలో ముంచబడాలి (మార్కు 16:16; అపొ.కా. 22:16).

పేతురు ఇట్లనుచున్నాడు : "ఏలయనగా మనలను దేవునియొద్దకు తెచ్చుటకు అనీతిమంతులకొరకు నీతిమంతుడైన క్రీస్తు శరీర విషయములో చంపబడియు, ఆత్మ విషయములో బ్రదికింపబడి పాపముల విషయములో ఒక్కసారే శ్రమపడెను. దేవుని దీర్ఘశాంతము ఇంక కనిపెట్టుచుండినప్పుడు పూర్వము నోవహు దినములలో ఓడ సిద్ధపరచబడుచుండగా అవిధేయులైన వారి యొద్దకు అనగా చెరలో ఉన్న

ఆత్మలయొద్దకు ఆయన ఆత్మరూపిగానే వెళ్ళి వారికి ప్రకటించెను. ఓడలో కొందరు, అనగా ఎనిమిదిమంది నీటిద్వారా రక్షణ పొందిరి. దానికి సాదృశ్యమైన బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించు చున్నది; అదేదనగా శరీర మాలిన్యము తీసివేయుట కాదుగాని యేసు క్రీస్తు పునరుత్థాన మూలముగా దేవుని విషయము నిర్మలమైన మన స్సాక్షి నిచ్చు ప్రత్యుత్తరమే" (1 పేతురు 3:18-21).

నోవహు, అతని కుటుంబము నీటి ద్వారా రక్షింపబడ్డారని పరిశుద్ధాత్మావేశ లేఖకుడు చెప్పిన దానిని దయచేసి గమనించుము. అదేవిధముగా ఈనాడు మనము బాప్తిస్మము ద్వారా రక్షింపబడు చున్నామని అతడు చెప్పుచున్నాడు. బాప్తిస్మం అనగా స్నానం చేయుటగాని, లేక శరీర మాలిన్యము పోగొట్టుకొనుటగాని కాదు, గాని దేవుని విషయము నిర్మలమైన మనస్సాక్షినిచ్చు ప్రత్యుత్తరమే. ఇంకోమాటలో మనం బాప్తిస్మం పొందాలని ప్రభువు ఆజ్ఞాపించాడు; ఆయన యెదుట మనం నిర్మలమైన మనస్సాక్షి కలిగి యుండాలంటే ఆయన ఆజ్ఞాపించిన రీతిగా బాప్తిస్మం పొందాలి. మనం అట్లు చేసి నప్పుడు ప్రభువు మనల్ని రక్షిస్తాడు. రక్షింపబడాలంటే నోవహు అతని కుటుంబము ఓడలో ఉండాల్సివచ్చింది. అల్లే మనం రక్షింప బడాలంటే క్రీస్తు సంఘములో యుండాలి. సంఘమే రక్షిస్తుందా యని అనుకోవచ్చు. ఓడ రక్షించిందా? కాదు, నిజానికి దేవుడే రక్షకుడు. అయితే రక్షింపబడాలంటే ఓడలో ప్రవేశించాలని దేవుడాజ్ఞాపించాడు. సంఘాన్ని గూర్చి కూడా ఈ సంగతి సత్యం. సంఘము రక్షించేది కాదు, ఏలయనగా రక్షింపబడినవారు సంఘములో యున్నారు. కాని సంఘానికి రక్షకుడు క్రీస్తే (ఎఫెసీ 5 : 23). రక్షింపబడినవారిని సంఘ ముతో ఆయన చేర్చుతాడు (అపొ.కా. 2 : 47). గనుక రక్షింపబడా లంటే ఒకడు సంఘములో యుండాలి.

ఒకే ఒక్క ఓడ ఎలాగున్నదో, ఒకే ఒక్క సంఘమున్నదని గమ

నించుము. ఓడకు వెలుపల యున్నవాడెవడు రక్షింపబడలేదు. క్రీస్తు సంఘానికి వెలుపల యున్న వాడెవడు రక్షింపబడడు. మానవకల్పిత సంఘాలు మొదలగు వేరే పద్ధతులద్వారా రక్షింపబడాలనుకొనే వారున్నారు. అయితే యివి ప్రభువు సంఘానికి ఆయన మార్గానికి బదులుగా ఉండనేరవు. ప్రభువు మార్గమే నిజమైన మార్గమని జ్ఞాపకముంచుకొనుము.

చివరిగా, నోవహు అతని కుటుంబము రక్షింపబడి ఆరిన నేలపై దిగినప్పుడు వారు దేవుని ఆరాధించి ఒక క్రొత్త జీవితాన్ని ఆరంభించారు. మనము దేవునికి లోబడి క్రీస్తులోనికి ఆయన సంఘములోనికి బాప్తిస్మము పొందినప్పుడు నూతన జీవితము గలవారమై నడుచుకొనాలని పౌలు చెప్పుచున్నాడు (రోమా 6 : 3, 4). మనం క్రీస్తులోనికి బాప్తిస్మం పొందినప్పుడు పాతసంగతులను విడిచిపెట్టాము. ఇదిగో సమస్తము క్రొత్తవాయాయి (2 కొరింధీ 5 : 17). క్రైస్తవుల వలె మనం దేవుని ఆత్మతోను సత్యముతోను ఆరాధించాలి (యోహాను 4 : 24; అపొ.కా. 20 : 7). ఓడకు సంఘానికి గల తారతమ్యములను మనం ఇక్కడ చూడగలం.

దీనినుండి మనం కొన్ని పాఠాలను నేర్చుకొందాం. నోవహు హెచ్చరికను మన్నించక జలప్రళయంలో నాశనం చేయబడిన పురాతన కాల దుష్టులవలె మనం ఉండరాదు. సరిగదా క్రీస్తును విని, ఆయన చిత్తానికి లోబడి ఆయన సంఘములో సభ్యులమై నేటి లోకంలోను రాబోవు లోకంలోను రక్షింపబడు నిమిత్తము జ్ఞానులమై యుండము. ప్రభువు మరల వచ్చి తన సంఘాన్ని పరలోకమునకు కొనిపోవుదునని, దుర్మార్గులను నిత్య నరకాగ్నిలో నాశనము చేతునని వాగ్దానం చేసాడు.

# మానవునికి అవసరమయిన విమోచన

## *(Man's need of Redemption)*

మానవుడు దేవుని స్వరూపమందు, దేవుని పోలిక చొప్పున చేయబడినవాడు. ఇది భౌతిక సంబంధమైన స్వరూపము కాదు. ఏలయనగా దేవుడు భౌతిక కాయుడు కాదు. ఆయన ఆత్మయై యున్నవాడు. అందువలన మానవుడు దేవుని ఆత్మీయ స్వరూపములో చేయబడినవాడు. మానవుడు యోచనాశక్తి, జ్ఞానము, భావములు, ఇచ్ఛ, వాంఛ, నిశ్చయత మొదలగు గుణములను కలిగినవాడు. అతడు బాధ్యతాయుక్తుడు, మంచి చెడ్డల నెరిగినవాడు. వాటి విచక్షణను ఎరిగినవాడు. అంతరాత్మను, మనస్సాక్షిని గలవాడు.

అయితే మానవుడు అనేకసార్లు తన మనస్సాక్షికిని, తన దేవునికిని అవిధేయత చూపుటకు నిశ్చయించుకొనుట జరుగుచున్నది. మానవజాతి యంతటిలోను మొదటి స్త్రీ పురుషులు, ఆదాము, హవ్వలు పాపము నారంభించిరి. వారు దేవునియెడల చూపిన అవిధేయతయందు మానవులందరు కొనసాగుచునేయున్నారు. "ఇందునుగూర్చి వ్రాయబడిన దేమనగా - నీతిమంతుడు లేడు, ఒక్కడును లేడు. గ్రహించువాడెవడును లేడు, దేవుని వెదకువాడెవడును లేడు. అందరును త్రోవ తప్పి యేకముగా పనికిమాలినవారైరి. మేలు చేయువాడు లేడు. ఒక్కడైనను లేడు". "ఏ భేదమును లేదు; అందరును పాపముచేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేకపోవుచున్నారు" (రోమా 3:10, 23). మానవులు పాపముచేయుటచే కలుగు జీతము భౌతిక, ఆత్మీయ మరణములై యున్నవి (రోమా 6:23).

మానవుడు పాపము చేయుటవలన శాపమునకు లోనై యున్నాడు - మరణము. "ధర్మశాస్త్రము విధించిన క్రియలకు సంబంధులందరు శాపమునకు లోనై యున్నారు. ఎందుకనగా ధర్మ

శాస్త్ర గ్రంథమందు వ్రాయబడిన విధులన్నియు చేయుటయందు నిలకడగా ఉండని ప్రతివాడును శాపగ్రస్తుడు అని వ్రాయబడి యున్నది (గలతి 3:10, 11). ఈ శాపమునుండి దేవుని సహాయము లేనిదే మానవుడు తనకుతాను విడుదల పొందలేడు. "పాపము చేయు ప్రతివాడును పాపమునకు బానిసయై యున్నాడు" అని యేసు చెప్పెను (యోహా 8:34). అందువలన ఈ పాపపు బానిసత్వమునుండి విడిపించుటకు మానవునికి ఒక సహాయకారి, విమోచనకర్త, రక్షకుడు విడుదల చేయించువాడు అవసరమై యున్నాడు.

## పాప పర్యవసానము

మానవులందరూ పాపులే యని మనం అంగీకరించక తప్పదు. పాపమును మనం వారసత్వపు హక్కువలె సంపాదించుకొనము గాని ఇతరులు చేసిన పాపమునకు ప్రతిఫలము ఒక్కొక్కసారి మనం అనుభవించుట జరుగును. ఒకడు దొంగతనము చేయుటవలన జైలులో వేయబడెననుకొందాము. దొంగతనం చేసినందున శిక్ష అతనికే విధించబడును. శిక్షను భరించువాడుకూడా అతడే. గాని తన పిల్లలయితే ఇంటివద్ద ఉండి తినడానికి తిండిలేక బాధపడుచూ యుంటారు. మరలా, పిల్లలు దొంగలు కాకపోయినను, తండ్రి చేసిన పనినిబట్టి పిల్లలుకూడా సిగ్గును భరించవలసి వచ్చును. ఇందు విషయమై బైబిలు చెప్పినదేమంటే, "పాపము చేయువాడే మరణము పొందును; తండ్రియొక్క దోషశిక్షను కుమారుడు మోయుటలేదని, కుమారుని దోషశిక్షను తండ్రి మోయడు; నీతిపరుని నీతి ఆ నీతిపరునికే చెందును; దుష్టుని దుష్టత్వము ఆ దుష్టునికే చెందును" (యెహెజ్కేలు 18:20). మనము చేయు పాపమునకు మనమే బాధ్యులము. "అయితే నీవు నీ సహోదరునికి తీర్పు తీర్చనేల? నీ సహోదరుని నిరాకరింపనేల? మన మందరము దేవుని న్యాయపీఠము ఎదుట నిలుతుము. నాతోడు, ప్రతి మోకాలును నా యెదుట వంగును, ప్రతినాలుకయు దేవుని స్తుతించును అని ప్రభువు

చెప్పుచున్నాడు" అని వ్రాయబడి యున్నది. కనుక మనలో ప్రతి వాడును తన్ను గూర్చి దేవునికి లెక్క యొప్పగింప వలెను" (రోమా 14:10-12).

ఆదాము హవ్వలు పాపము చేసినప్పుడు, ఆదాము హవ్వను నిందించెను. హవ్వ సర్పమును నిందించెను. అయితే దేవుడు ఆ ముగ్గురను నిందించి శిక్షించెను.

## పాపము అంటే

దేవుని ఆజ్ఞను అతిక్రమించుట పాపము. దేవుని ఆజ్ఞలకు మనం కొంత కలుపుటగాని, తీసివేయుటగాని పాపము (ద్వితీ 4:2; ప్రకటన 22:18-19). దేవుని చిత్తమును జరిగించకుండ యుండి ఆయనపై తిరుగుబాటు చేయుట పాపము (రోమా 2 : 4-5; మత్తయి 7:21). దేవుని ఆజ్ఞల స్థానముననే మరొకటి చేయుట పాపము (మార్కు 7:7-9). మేలైనది చేయనెరిగియు ఆలాగున చేయువానికి పాపము కలుగును (యాకోబు 4:17). దేవుని వాక్యమును సరిగ గ్రహింపక దానిని అపార్థము చేసికొని, మార్పుచేసి, దుర్బోధలను బోధించుట పాపము (2 పేతురు 3:16). దేవుని వాక్యము విషయమై అజ్ఞానము కలిగి యుండుట పాపము (లేవీ 5:17, అపో. కా. 17:30). దేవుని మాటలకు సంపూర్ణ విధేయత చూపించని యెడల పాపము. దేవుని ఆజ్ఞలను విని మనకు ఇష్టము వచ్చినవాటికి లోబడి మిగిలినవాటిని నిర్లక్ష్యముచేసిన యెడల అది మనకు పాపము. "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును" అని యేసు చెప్పి నప్పుడు మనం నమ్మినంత మాత్ర మున నే రక్షణ పొందగలము అని అనుకొనుటగాని, అట్లు బోధించుట గాని పాపము. బాప్తిస్మము పొందుట నాకు ఇష్టము లేదు గనుక నేను నమ్ముదునుగాని బాప్తిస్మమును పొందను అని తలంచుట పాపము. దయ్యములు యేసును నమ్మి వణకుచున్నవి. అయితే అవి రక్షింపబడగలవా ? (యాకో 2:19).

మనకు వర్తించని ఆజ్ఞలకు విధేయత చూపుటకూడా పాపము కాగలదు. మనం ఇప్పుడు క్రీస్తు యుగంలో యున్నాము గనుక క్రొత్త నిబంధన ప్రకారము నడచుకొనవలెను. గాని మోషే ధర్మశాస్త్రమునుబట్టి కాదు. క్రీస్తు సంఘము స్థాపించబడిన ఆరంభములో "కొందరు యూదయనుండి వచ్చి మోషే నియమించిన ఆచారము చొప్పున సున్నతి పొందితేనేగాని రక్షణ పొందలేరని బోధించిరి" (అపొ. కా. 15:1). అప్పుడు అపొస్తలులును, పెద్దలును ఈ సంగతిని గూర్చి ఆలోచించుటకు కూడి వచ్చిరి. బహు తర్కము జరిగిన తరువాత పేతురు లేచి వారితో ఇట్లనెను. "మన పితరులైనను, మనమైనను మోయలేని కాడిని శిష్యుల మెడమీద పెట్టి మీరెందుకు దేవుని శోధించుచున్నారు? ప్రభువైన యేసు కృపచేత మనము రక్షణ పొందుదుమని నమ్ముచున్నాము గదా?" (అపొ. కా. 15:10-11).

## పాప ఫలితము

పాపమువలన కలుగు ఫలితమేమి? భరింపరాని సిగ్గు కలుగును. ఆదాము హవ్వలు పాపముచేసి చెట్లచాటున దాగుకొనిరి - సిగ్గువలన. పాపమువలన బహు పిరికితనము వచ్చును. "ఎవడు తరుమకుండగనే దుష్టుడు పారిపోవును. నీతిమంతులు సింహమువలె ధైర్యముగానుందురు" అని బైబిలు బోధించుచున్నది (సామెతలు 28:1). పాపము అంధత్వమును, అజ్ఞానమును కలుగజేయును, మనుష్యులను వాతవేయబడిన మనస్సాక్షిగలవా రగునట్లు తయారుచేయును. దానికి బానిసలుగా చేసికొని సంకెళ్ళతో బంధించును. మానవులను నిస్సారముగ తయారుచేయును. మానవులను దేవునినుండి వేరుచేయును. "మీ దోషములు మీకును మీ దేవునికిని అడ్డముగా వచ్చెను. మీ పాపములు ఆయన ముఖమును మీకు మరుగుపరచెను" అని యెషయా ప్రవక్తవ్రాసెను (యెష 59:1-2). పాపమువలన దేవుని ఉగ్రత మనపై వచ్చును. "దుర్నీతిచేత సత్యమును అడ్డగించు మనుష్యుల యొక్క

సమస్త భక్తిహీనత మీదను, దుర్నీతిమీదను దేవుని కోపము పరలోకమునుండి బయలు పరచబడుచున్నది" (రోమా 1 : 18). చివరకు పాపమునుండి విముక్తి పొందని వారికి నిత్య నరకము తధ్యము. "ఎవని పేరైనను జీవగ్రంథమందు వ్రాయబడినట్టు కనబడని యెడల వాడు అగ్నిగుండములో పడవేయబడును" (ప్రకటన 20:15).

పాపముచేయు ప్రతివాడును పాపమును దాచిపెట్టుటకు ప్రయత్నము చేయును. "అతిక్రమములను దాచిపెట్టువాడు వర్ధిల్లడు. వాటిని ఒప్పుకొని విడిచిపెట్టువాడు కనికరము పొందును" అని దేవునివాక్యము చెప్పుచున్నది (సామె 28 : 13). అయితే పాపములను మానవులు ఎందుకు దాచిపెట్టుదురు ? మానవులు సహజంగా ప్రేమింపబడాలనే ఆశ కలిగినవారు. వారు దేవునిచేగాని, తోటి మానవులచేగాని తిరస్కరింపబడడానికి భయపడుదురు. అందువలన పాపమును సాధ్యమైనంత మట్టుకు దాచిపెట్టుదురు. అయితే యెహోవా కనుదృష్టికి మరుగైనది ఏదియును లేదు. సరిగదా ఎవరిపాపము వారిని పట్టుకొనును అని దైవగ్రంథము బోధించుచున్నది (సంఖ్య 32:23). మన పాపము ఎల్లప్పుడు మన యెదుటే ఉండును (కీర్తన 51:3). గనుక మనం ఏమి విత్తితిమో ఆపంటనే కోయుదుమనెడి భీతి మనలో లేకపోలేదు. అందువలన పాపమువలన వచ్చు శిక్షనుండి తప్పించుకొనవలెననెడి ఆశ కలిగియున్నవారము, మానవులైన మనము.

## ముక్తి మార్గం

మనం దినదినము చేయుచున్న పాపముల భారము మరింత ఎక్కువగుటచే పాపమునుండి విముక్తిని పొందుట యెట్లు? నా ఆత్మశుద్ధిని సాధించుట యెట్లు ! మోక్షమునకు చేరగలుగుట యెట్లు అని మనలో ప్రతివారు తప్పక ఆలోచించుట జరుగుచున్నది. అయితే మనలను మోక్ష రాజ్యమునకు నడిపించు రక్షకుడు ఒకే ఒక్క

డున్నాడు. ఆయన యేసుక్రీస్తు. "క్రీస్తుకూడ మీ కొరకు బాధపడి, మీరు తన అడుగుజాడలయందు నడచుకొనునట్లు మీకు మాదిరి యుంచిపోయెను. ఆయన పాపము చేయలేదు. ఆయన నోటను ఏ కపట మును కనబడలేదు. ఆయన దూషింపబడియు, బదులు దూషింపలేదు. ఆయన శ్రమపెట్టబడియు బెదిరింపక న్యాయముగా తీర్పుతీర్చు దేవునికి తన్నుతాను అప్పగించుకొనెను. మనము పాపముల విషయమై చని పోయి, నీతి విషయమై జీవించునట్లు ఆయన తానే తన శరీరమందు మన పాపములను మ్రానుమీద మోసికొనెను. ఆయన పొందిన గాయములచేత మీరు స్వస్థత నొందిరి. మీరు గొర్రెలవలె దారితప్పి పోతిరిగాని ఇప్పుడు ఆత్మల కాపరియు, అధ్యక్షుడు నైన ఆయనవైపు మళ్ళియున్నారు" అని పేతురు వ్రాయుచున్నాడు (1 పేతు 2:21-25).

ప్రయాసపడి పాపభారము మోసికొనుచున్న సమస్తమైన వార లారా, నాయొద్దకు రండి అని యేసుక్రీస్తు మిమ్మును పిలుచుచున్నాడు. నేడు మీరు ఆయన పిలుపును అంగీకరించినయెడల, ఆయనయందు విశ్వాసముంచి, మార్పునొందిన జీవితాన్ని జీవించుటకు నిశ్చయించు కొని, ఆయన నామమునుబట్టి ప్రార్థనచేసి, బాప్తిస్మము పొంది, మీ పాపములను కడిగివేసికొనండి. అప్పుడు మీకు శాంతి సమాధానములు తప్పక లభించును (యోహా 14:1; రోమా 2:4; అపొ.కా. 22:16).

— జాషువా గూటం.

---

విశ్వాస వీరులు - 3

## దేవునిచే హెచ్చరింపబడిన నోవహు

## *( Noah, a man Who was Warned of God )*

"విశ్వాసమును బట్టి నోవహు అదివరకు చూడని సంగతులను గూర్చి దేవునిచేత హెచ్చరింపబడి భయభక్తులు గలవాడై తన యింటి వారి రక్షణకొరకు ఒక ఓడను సిద్ధము చేసెను; అందువలన అతడు

లోకమువిూద నేరస్థాపన చేసి విశ్వాసమును బట్టి కలుగు నీతికి వారసు డాయెను" (హెబ్రీ 11:7).

నోవహు కథ యౌవనులకేమి వృద్ధులకేమి అందరకు ఇష్టమే. అది వర్ణించబడిన రీతినిబట్టి దాన్ని చదివేకొలదీ ఆసక్తి ఎక్కువౌతాది. "మహాగాధ జలముల ఊటలన్నియు ఆ దినమందే విడవబడెను. ఆకాశపు తూములు విప్పబడెను" (ఆది 7 : 11). అయితే మానవజాతి యంతటిలోను తన కుటుంబముతో నాశనము కాకుండ రక్షింపబడిన నోవహును మనం మరచిపోరాదు. నోవహును గూర్చి గమనించదగిన నాలుగు విషయాలను మీకు చూపించగోర్తాను.

1. నోవహు నీతిపరుడును తన తరములో నిందారహితుడునై యుండెనని మనం ఆదికాండము 6:9 లో చదువగలము. ఏమానవునికైనా వాంఛింపదగిన లక్షణం యిది. అయితే నోవహు కాలమునాటి ప్రపంచ పరిస్థితిని మనం గమనించి నప్పుడు అతనిపై మనకున్న అభిమానం మరింత ఎక్కువ అవుతాది. ఆనాటి ప్రపంచం యిట్లున్నది : "నరుల చెడుతనము భూమిమీద గొప్పదనియు వారి హృదయము యొక్క తలంపులోని ఊహ అంతయు ఎల్లప్పుడు కేవలము చెడ్డదనియు యెహోవా చూచెను". "భూలోకము దేవుని సన్నిధిని చెడిపోయి యుండెను; భూలోకము బలాత్కారముతో నిండి యుండెను" (ఆది 6 : 5, 11).

మన చుట్టుప్రక్కల యున్న వారంతా నీతిమంతులుగా జీవించుచున్నట్లయితే మనంకూడా నీతిగా జీవించడం కష్టమేమీ కాదు. అయితే లోకమంతా దుష్టత్వంతో నిండియున్నప్పుడు నీవొక్కడవే నీతిగా జీవించడం మహాకష్టం. అంత దుర్మార్గలోకంలో దేవుని యెడల నమ్మకంగా యున్నాడంటే నోవహుకున్న విశ్వాసం ఎంతో గొప్పది.

2. నోవహు నీతిని ప్రకటించాడని 2 పేతురు 2:5 లో పేతురు

మనకు చెప్పుచున్నాడు. అతడు ప్రజలయందాసక్తి గలవాడు. దేవుని కిష్టపూర్వకంగా యున్నానులే యని అతడు సంతృప్తి జెంది యుండ వచ్చును గాని ఎవడును శిక్షకు పాత్రుడు కారాదని అతడు తలంచాడు. గనుక ఆ ప్రజలు ఎంత దుష్టులు దుర్మార్గులైనను అతడు వారి మధ్యకు వెళ్ళి మానవులయెడల దేవుని చిత్తాన్ని వారికి తెలియజేసాడు. వారు వినినను, వినకపోయినను వారికి ప్రకటించాడు. (వారు వినలేదని మనకు తెలుసు. ఎందుకంటే వారు విని విధేయత చూపితే వారుకూడ ఓడలో రక్షింపబడి యుందురు). వారు వినకపోయినను, వందలకొలది సంవత్సరాలు నోవహు ప్రకటించాడంటే అతడెంత గొప్పవాడో! అయినను దేవుని వాక్యమందలి శక్తిని గూర్చిన అతని విశ్వాసం అచంచలంగానే యుండిపోయింది.

3. దేవుడాజ్ఞాపించిన యావత్తు నోవహు చేసినట్లు కనీసం రెండుసార్లు లేఖనాల్లో చెప్పబడింది (ఆది 6 : 22; 7 : 5). అప్పటికి ముందెన్నడు భూమిమీద వర్షం కురియకపోయినను ఓడను నిర్మించు టలో నోవహు దేవునికి విధేయుడయ్యాడు! విశ్వాసం అంటే అదే! ఎందువలన దేవుడు ఆజ్ఞాపించాడో గ్రహించుకోలేకపోతే ఆయనకు విధేయులగుటకు చాలమంది సంశయిస్తారు. దేవుడు చెప్పిన రీతిగానే చేయుటలో మనం నోవహును వెంబడించాలి.

4. నోవహును గూర్చి మనం గమనించవలసిన నాలుగో విషయం యేమంటే అతడు విశ్వాసమునుబట్టి కలుగు నీతికి వారసు డయ్యాడు. అంటే నీతిగా జీవించువారికి వాగ్దానము చేయబడిన దీవెన లన్నియు అతడు పొందాడని దీని అర్థం.

మనం నీతికి వారసులం కావాలంటే నోవహు చేసినట్లు చెయ్యాలి. మన కాలమునాటి ప్రజల మధ్య నిందారహితులుగా యుండాలి, నీతిని ప్రకటించాలి, దేవుడాజ్ఞాపించిన యావత్తును చెయ్యాలి.

— డేవిడ్ జాన్సన్.

# రాజ్యంలో స్థలం

## ( *Room in the Kingdom* )

భూమిపై దేవుని రాజ్యాన్ని స్థాపించుటకు యేసుప్రభువు వాగ్దానం చేసాడు. (మత్తయి 16:18, 19). పెంతెకొస్తునాడు సంఘం ఆరంభమైనప్పుడు ఈ వాగ్దానం నెరవేరింది (అపొ. కా. 2:41, 47).

కొలస్సయలోని సహోదరులు దేవుని ప్రియకుమారుని యొక్క రాజ్య నివాసులుగా చేయబడ్డారని పౌలు చెప్పాడు (కొలస్స 1:13). తాను ఆ రాజ్యములో యున్నానని యోహాను వ్రాసాడు (ప్రక 1:9). గనుక దేవుని రాజ్యము స్థాపింపబడి ఇప్పుడున్నది. సువార్త ప్రకటన ద్వారా ప్రజలు ఈ రాజ్యములోనికి ఆహ్వానింప బడుచున్నారు.

### అన్ని జనాంగములకు

దేవుని రాజ్యమైన క్రీస్తుసంఘములో అన్ని జనాంగముల వారికీ స్థలం ఉన్నది. "కాబట్టి మీరు వెళ్ళి సమస్తజనులను శిష్యులనుగా చేయుడి." "మరియు మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి" యని యేసుప్రభువు ఆజ్ఞాపించాడు (మత్త 28:19; మార్కు 16:15).

ఈ రాజ్యము ఇశ్రాయేలీయుల స్వంతరాజ్య మాత్రాదని అపొస్తలులు భావించారు. సువార్త వల్ల అన్య జనాంగములకు కూడా వేయబడతానని మొదట వారు గ్రహించలేకపోయారు. వారాయనకు యెరూషలేము యూదయ సమరయ దేశముల యందంతటను భూదిగంతముల వరకును సాక్షులుగా యుందురని క్రీస్తు చెప్పాడు (అపొ. కా. 1 : 8).

అవును సువార్త అన్ని జనాంగములకు, అన్ని జాతులవారికి, అన్ని వర్గస్థులకు అవుసరం. క్రీస్తునందు యూదుడని గ్రీసుదేశస్థుడని లేదు; దాసుడని స్వతంత్రుడని లేదు; పురుషుడని స్త్రీయని లేదు (గలతీ

8:28). ఏ దేశస్థుడయినను, ఏ జాతివాడయినను సరే క్రీస్తు యొక్క మహిమ రాజ్యంలో భాగంగా యుండాలనుకొంటే అందులో స్థలం ఉన్నది.

## పెరుగుదలకు

ఆదిమసంఘము సువార్త ప్రకటించడానికి ఆసక్తి కలిగి యుండేది. మానవుల ఆత్మలయెడల వారికున్న ఆసక్తి ఎంతగొప్పదో అపొస్తలుల కార్యముల ప్రతి పుటలో కనబడుచున్నది. కొన్నిసార్లు సంఘాలు ఒక దశకు చేరిన తరువాత పెరగడం మానివేస్తాయి. ఆరాధన స్థలంనిండా ప్రజలున్నను ఆ సంఘం నిండిపోలేదని మనం గమనించాలి.

మీ వూరిలో ఐదువేల జనాభా యుంటే ఐదువేలమందికి సువార్త చెప్పడానికి నీవు ప్రయత్నించాలి. మీ పట్టణంలో 8 లక్షల మంది యుంటే, 8 లక్షలమందికి నీవు సువార్త చెప్పడానికి ప్రయత్నించాలి. యుక్తవయస్సు గల ప్రతివానికొరకు క్రీస్తురాజ్యంలో స్థలం ఉన్నది. దేవునిరాజ్యం తటస్థంగా యుండేది కాకుండా, అది దినదినము వ్యాపించేది. సమస్తజనులు దానిలోనికి ప్రవహిస్తారు. ధనికులకు ధనహీనులకు దానిలో స్థలం ఉన్నది. విద్యావంతులకు, పామరులకు దానిలో స్థలం ఉన్నది. ఘనులకు అల్పులకు అందులో స్థలం ఉన్నది. క్రీస్తు రాజ్యంలో నీకు కూడా స్థలం ఉన్నది!

— బేరీ కన్నింగమ్.

## ఏ భేదములేదు

### *(There is no Distinction)*

ఆధునిక మత గురువులు నేటి శారీరక ఇశ్రాయేలీయుల యెడల దేవుని సంకల్పం యేదో వున్నదని తలంచుట ఆశ్చర్యంగా యుంది. నేటి యూదునికేమి భూమిమీదనున్న మరియే జాతివానికేమి దేవుడు

ఒకే సంకల్పమును కలిగియున్నాడని క్రొత్త నిబంధన బోధించుచున్నది. మానవులతో దేవుడు సంప్రదించునపుడు యూదునికేమి అన్య జాతీయునికేమి మరికేవనికైనా నేమి ఏ భేదము లేదని బైబిలు బయలుపరచుచున్నది.

"ప్రతి జనములోను ఆయనకు భయపడి నీతిగా నడచుకొను వానిని ఆయన అంగీకరించును" (అపొ.కా. 10:35).

"వారి హృదయములను విశ్వాసమువలన పవిత్రపరచి మనకును వారికిని (యూదులకు, అన్యజనులకు) ఏ భేదమైనను కనుపరచలేదు" (అపొ.కా. 15:9).

"ఏ భేదమును లేదు" (రోమా 3:23). "యూదుడని గ్రీసు దేశస్థుడని భేదములేదు; ఒక్క ప్రభువే అందరికి ప్రభువై యుండి తనకు ప్రార్థనచేయు వారందరి యెడల కృప చూపుటకు ఐశ్వర్యవంతుడై యున్నాడు" (రోమా 10:12).

అయితే నేటి ఇశ్రాయేలు దేశముసంగతి యేమిటి? ఇశ్రాయేలు రాజ్యము అది ఆరంభించినప్పుడే దేవుని చిత్తాన్నిబట్టి యున్నది కాదు. వారు రాజ్యముగా అయినప్పుడు "దేవునినే తిరస్కరించారని" భావింపబడింది (1 సమూయేలు 8:7). "ప్రభువైన యెహోవాకన్ను ఈ పాపిష్టి రాజ్యముమీద నున్నది, దానిని భూమిమీద ఉండకుండ నాశనము చేతును" అని దాన్నిగూర్చి దేవుడు పలికాడు (ఆమోసు 9:8).

భౌతిక సంబంధమైన ఇశ్రాయేలు రాజ్యము (The secular State of Israel) దేవుని చిత్తప్రకారమైనది కాదు. అబ్రాహాము యొక్క ఆత్మీయసంతతి ఆ రాజ్యములో యున్నను, ఆ రాజ్యాన్ని మాత్రం దేవుడు తన ప్రజలుగా ఏర్పరచుకోలేదు. ఇశ్రాయేలు

దేశాన్నే కాదు మరియే దేశాన్ని కూడా ఆయన తన ప్రజలుగా ఏర్ప రచుకోలేదు. అందువలన దేవుని దృష్టిలో, లేక సంకల్పంలో ఇశ్రాయేలు దేశానికినీ, మిగతా దేశాలకును ఏదైనా భేదం ఉన్నదని తలంచరాదు.

## భే ద మే మీ లే దు

'ఏ భేదములేదు' అని ప్రభువు సెలవిచ్చిన మాట యొక్క సంపూర్ణ భావాన్ని మనం గ్రహించినప్పుడు, దేవునికొరకు ప్రత్యేకంగా ఏర్పరచబడ్డ జనాంగము, లేక దేశము ఏదైనా ఉన్నదనే తలంపు తొలగిపోతాది. ఈ నాడయితే ఎవరు యేసుక్రీస్తు యొక్క ఆత్మీయ శరీరంలో (సంఘములో) సభ్యులుగా యుంటారో, ఎవరు తమ విశ్వాసానికి విధేయత చూపుచు క్రీస్తును వెంబడిస్తారో వారు 'ఆయన ఏర్పరచుకొనిన ప్రజలు.' క్లుప్తంగా - దేవునియందున్న క్రీస్తు సంఘము ఆయన ఏర్పరచుకొనిన ప్రజలు; వారు తప్ప మరొకరు కారు. దీనినుండి ఏ ప్రత్యేక జాతివారు యూదులుగాని, అన్యజనులు గాని విడదీయబడ లేదు. అయితే ఏదో ఒక జాతివారు దేవునికి ప్రత్యేకమైన వారనుట క్రొత్తనిబంధన లేఖనములకు కేవలం భిన్నముగా యున్నది.

పాత నిబంధనలో అబ్రాహాముకు చేయబడిన వాగ్దానము లన్నియు నేడు 'నూతన ఇశ్రాయేలు' అయిన క్రీస్తు సంఘమునకు చెందుతాయి. "మీరు క్రీస్తు సంబంధులైతే, ఆ పక్షమందు అబ్రాహాము యొక్క సంతానమైయుండి వాగ్దానప్రకారము వారసులై యున్నారు" (గలతీ 3:29). క్రీస్తుద్వారా దేవుడు నేడు అందరినీ పిలుచుచున్నాడు!! (మత్తయి 11:28).

—బర్టన్ కాఫ్‌మన్.

# క్రీస్తు చేసిన నలువది దినముల ఉపవాసము

## *( Christ's Forty-Day Fast )*

మనలో ఎవరైనా నలభై దినాలు ఉపవాసం ఉండాలంటే అది మన వల్లకాని పని. నిజానికి నలభై గంటల మట్టుకు ఉపవాసం ఉండాలంటేనే చాలమంది విరమించుకొంటారు. అయితే మన ప్రభువు అపవాదిని ఎదుర్కొనుటకు ముందు నలువది దివారాత్రులు ఉపవాసమున్నాడు (మత్తయి 4:1-11).

ఒకటి రెండు రోజులమట్టుకు ఆహారమేమీ తీసికోలేకపోతే శారీరక లాభం పొందవచ్చును. మన శరీరంలోయుండే కలుషితాలు బయటికి పోతాయి, జీర్ణావయవములకు కొంత తీరిక లభిస్తాది. అయితే దీర్ఘకాల ఉపవాసం ఉంటే శరీరం గొప్ప దెబ్బతింటాది. అటువంటి ఉపవాసంయొక్క ఉద్దేశం భౌతికం కాదు గాని మానసికం, ఆత్మీయం అయ్యుంటాది. ఒకని నిగ్రహ బుద్ధికి దేవునియెడల యున్న భక్తికి అది నిదర్శనం. నలువది దినముల మట్టుకు ఉపవాసం ఉండుట ఒకని శరీరానికే కాదు ఆత్మయొక్క సహనానికే గొప్ప పరీక్ష.

అయితే నలువది దినములు ఉపవాసం ఉండుట ప్రపంచ రికార్డు యేమీకాదు. ఆధునిక కాలంలో మానవులు యాభై, అరవై డెబ్బయి రోజులమట్టుకు సాంఘికంగానో లేక రాజకీయంగానో నిరసనగా ఉపవాసం (సత్యాగ్రహం) చేసారు. ఇంచుమించు అందరు చనిపోయారు. కాని వారు చేసిన ఉపవాసమువలన విజ్ఞాన శాస్త్రజ్ఞులకు మానవ శరీరంపై దీర్ఘకాల ఉపవాసంయొక్క ప్రభావాన్ని తెలుసుకొనే అవకాశం దొరికింది. అంతేగాక యేసు ప్రభువు చేసిన 40 దినముల ఉపవాసాన్ని గూర్చిన ఆశ్చర్యకరమైన సంగతిని అది వెలికి తెచ్చింది.

### దీర్ఘకాల ఉపవాసం నెమ్మదిగా కలుగు మరణం(Slow Death)

అని చెప్పబడింది. అది భయంకరమైనది. అది భరింపరాని ఆకలితో ఆరంభమౌతాది, కడుపులో తిమ్మిర్లు (Stomach Cramps) పుట్టతాయి, వాంతులు అవుతాయి; వ్యక్తిత్వం ఘోరంగా మారిపోతాది; వెట్ట కలిగియుండలేరు; బరువు తగ్గిపోతాది, కనుచూపు వినికిడిశక్తి క్షీణించిపోతాది. సూక్ష్మంగా వారు వాడిపోతారు.

దీన్నిబట్టి యేసు ప్రభువు ఎంతమట్టుకు సహించుకొన్నాడో మనం తెలిసికోవచ్చు. అయితే శాస్త్రజ్ఞులను ఆశ్చర్యపరచిన దేమిటంటే ఆయన ఉపవాసంచేసిన కాలం - నలభై రోజులు. అయితే నలభై రోజుల మట్టుకే ఎందుకు? శాస్త్రజ్ఞుల రిపోర్టు ఈలాగున్నది:

"42వ రోజున రమారమి ఖచ్చితంగా ఉపవాసం ఉండేవారికి పీడకలలాంటి భయంకర అనుభూతి కలుగుతుంది. వారికి నిస్టేగ్మస్ (Nystagmus) అనే రోగం సంభవిస్తాది. శరీరంలో విటమిన్లు లోటు వలన కండరములను అదుపులోపెట్టే శక్తిని కోల్పోవుట అది. వారు ప్రక్కకు చూడాలంటే వారికళ్ళు అదుపులో లేకుండా అటు యిటు ప్రక్కలకు పైకి క్రిందికి విపరీతంగా తిరిగిపోతాయి. ఈ నిస్టేగ్మస్ వలన తరచు తలతిరుగుడు, వాంతులు సంభవిస్తాయి. ఈ అనుభవం అంతా చాల భయంకరమైనది. జరుగబోయేదాన్ని గూర్చి ఎంత ముందుగా చెప్పినను వారు దాన్ని ఎదుర్కోలేరు. చివరిగా 4, 5 రోజుల తరువాత అది అంతమైనప్పుడు ఉపవాసం చేస్తున్నవారు ఉత్సాహాన్ని పుంజుకొంటారు, తరువాత ఒక వారం రోజులమట్టుకు శారీరకంగాను మానసికంగాను కొంత ఉజ్జీవింపజేయబడ్తారు. అయితే వారి అంతం యేమంత దూరంగా లేదు. వారి మాటలు ఇప్పుడు తడబడ్తాయ్...వారు నెమ్మదిగా గుడ్డివారై పోవుచున్నారు".

దీనిలోయున్న గొప్పపాఠం యిది: నిస్టేగ్మస్ అనే ఈ రోగం రాకుండాను, దానివలన తన శరీరానికి కలిగే తిరుగులేని గాయముల వలన హానికలుగకుండాను సరిగ్గా ఉపవాస విరమణ ఎప్పుడు

చేయాలో క్రీస్తు ఎరిగి యుండెను! నలువది దినములకంటె పైగా ఉపవాసం ఉండుటలో ప్రయోజనం ఉండక పోవును; సరిగదా అది దేవుని శోధించినట్లగును. ఆహార లేమివలన శరీరము కృశించుచున్నను మన ప్రభువు ఎల్లప్పుడు ఆత్మనిగ్రహాన్ని కలిగి యుండెను. ఆయన నలువది దినములైన తరువాత ఉపవాస విరమణ చేసాడంటే, అటుపై రెండు రోజుల తరువాత మానవశరీరానికి ఏమి సంభవించునో ఎరిగి యుండెనన్న మాట! అందువలన అదే ఆయన దేవుని కుమారుడని మనకొక గొప్ప నిర్ధారణ యిచ్చు చున్నది.

ఆయన ప్రేమ ఎంత గొప్పది! మనకొరకు ఆయన ఎంత సహించాడో! ఆయన చేసిన ఈ గొప్పత్యాగం ఆయనకు మనం మరింతసేవ చేసేలాగున ప్రోత్సహించుట లేదా ?

—జాన్ టెంపుల్స్.

(FROM GOSPEL ADVOCATE, Nov. 3, 1983)

---

## సిలువను గూర్చి నీ నిర్ణయం యేమిటి ?

సిలువను గూర్చి ప్రకటించడం మొదటి శతాబ్ద బోధలో ప్రాముఖ్యం. 1 కొరింథీ 2:2 లో అపొ. పౌలు ఇట్లు చెప్పాడు : "నేను యేసుక్రీస్తును అనగా, సిలువ వేయబడిన యేసుక్రీస్తును తప్ప మరి దేనిని మీ మధ్య నెరుగకుందునని నిశ్చయించుకొంటిని." అయినాసరే శతాబ్దముల తరబడి మానవులు సిలువను గూర్చి ఈ రెండింటిలో ఏదో ఒకవిధంగా తలంచుచున్నారు: "సిలువను గూర్చిన వార్త నశించుచున్న వారికి వెర్రితనముగాని రక్షింపబడుచున్న మనకు దేవుని శక్తి" అని ఈ రెండు దృక్పధాలను గూర్చి పౌలు చెప్పాడు (1 కొరింథీ 1:18). "అయితే మేము సిలువవేయబడిన క్రీస్తును ప్రకటించుచున్నాము. ఆయన యూదులకు ఆటంకముగాను అన్యజనులకు వెర్రితనముగాను ఉన్నాడు; గాని యూదులకేమి గ్రీసుదేశస్థులకేమి పిలువ

బడిన వారికే క్రీస్తు దేవుని శక్తియు జ్ఞానమునై యున్నాడు" (1 కొరింథీ 1:23, 24).

మొదటిగా, నశించుచున్నవారు సిలువను గూర్చిన వార్తను వెర్రితనంగా భావిస్తారు. ఎవడైనను నరకానికి పోవుచున్నాడంటే అతడు దేవుని ప్రేమను తిరస్కరించినందువలనే పోవుచున్నాడు. ప్రతి దినము మనం సిలువను అంగీకరించడంగాని, తిరస్కరించడం గాని జరుగుతాది. అయితే "నాపక్షమున నుండనివాడు నాకు విరోధి" యని యేసు చెప్పినదాన్ని జ్ఞాపక ముంచుకొందము.

రెండవదిగా, క్రీస్తు సిలువ మన ఆత్మలను రక్షించే శక్తి యని మనం భావించాలి. సిలువలో శక్తి యున్నది. "నేను భూమిమీద నుండి పైకెత్తబడిన యెడల అందరిని నాయొద్దకు ఆకర్షించు కొందు నని" యేసుప్రభువు చెప్పాడు (యోహాను 12:32). దేవుని ప్రేమవలన సిలువయొద్దకు మనం ఆకర్షింపబడ్డాము. "అయితే దేవుడు మనయెడల తన ప్రేమను వెల్లడిపరచుచున్నాడు; ఎట్లనగా మనమింకను పాపులమై యుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను" (రోమా 5:8). మన కొరకు క్రీస్తు సిలువ శ్రమను భరించినందువలన మనం సిలువయొద్దకు ఆకర్షింపబడాలి. యోహాను 10:18లో "ఎవడును నా ప్రాణము తీసి కొనడు; నా అంతట నేనే దాని పెట్టుచున్నాను" అని ఆయన చెప్పాడు. సిలువలోయున్న రక్షణశక్తిని బట్టి మానవులందరు దానియొద్దకు ఆకర్షింపబడాలి. రోమా 1:16లో పౌలు ఇట్లనుచున్నాడు: "సువార్తను గూర్చి నేను సిగ్గుపడువాడనుకాను. ఏలయనగా నమ్ము ప్రతివానికి... రక్షణ కలుగజేయుటకు అది దేవునిశక్తియై యున్నది".

పరలోకానికి వెళ్లే మార్గంలో సిలువ యున్నది. నీవు పరలోకానికి చేరుకోగలిగితే, నీవు సిలువను ఎదుర్కొని నీ జీవితంలో దాని స్థానాన్ని అంగీకరించావని దానియర్థం. ఈ జీవితంలో మానవులందరు సిలువనుగూర్చి ఏదో ఒక నిర్ణయానికి రావాలి. సిలువనుగూర్చి నీ నిర్ణయం యేమిటి?

—జాన్ స్టేసీ.

## ఆదిమ సంఘ పునరుద్ధరణ ఒక ఘనమైన కృషి

సంఘారంభమును గూర్చి బైబిలు చెప్పుచున్నది. గొప్ప విశ్వాస భ్రష్టత్వమును గూర్చి కూడ అది ప్రవచించింది (2 థెస్స 2:3); ఒక్కసారే బయల్పరచబడిన విశ్వాసము నుండి తొలగిపోవుట యది (1 తిమో 4:1; యూదా:3; 2 పేతురు 2:1, 2). మానవులు వివిధ రీతులుగ తొలగిపోవులవలన అనేక మత శాఖలు ఉద్భవించినవి. అయినను ఆదిమ సంఘమును గూర్చిన క్రీస్తు సంకల్పము ఇంకా యేమియూ మార్పునొందలేదు.

నీ క్రొత్త నిబంధనను తీసికొని దానిని మరల చదువుము. అప్పుడు క్రొత్తనిబంధన సంఘాన్ని తిరిగి నెలకొల్పు. క్రైస్తవ్యముతో యూదా మతాన్ని (పాతనిబంధన మతాన్ని) మిళితం చేయవద్దు. మానవుల సిద్ధాంతాలను కూడా మనం అనుసరింపరాదు (మత్త 15:8, 9). పవిత్ర క్రొత్తనిబంధన క్రైస్తవ్యాన్ని పునరుద్ధరించుదాం.

యూదా మతాచారము లనేకములు ఆ కాలము మట్టుకే చెందినవి. క్రొత్త నిబంధనలో క్రీస్తు సంఘముయొక్క ఆరాధనలో అవి ఒక భాగముగా ఎన్నడు చేయబడలేదు. పశుబలులు, ధూపార్పణలు, వాద్య సంగీతము మొదలగున వెన్నడు క్రైస్తవారాధనలో ఒకభాగం కాదు. క్రైస్తవులు తమ ఆరాధనలో పాటలు పాడిరిగాని వాద్యముల నెన్నడు వినియోగించలేదు (రోమా 15:9; 1 కొరింథీ 14:15; అపొ.కా. 16:25; ఎఫెసీ 5:19; కొలస్స 3:16; హెబ్రీ 2:12; యాకోబు 5:13). క్రైస్తవులు పాతనిబంధన సబ్బాతునెన్నడు ఆచ

రించలేదు గాని (కొలస్స 2:14-16), క్రీస్తు పునరుత్థాన దినమగు ఆదివారమున కూడుకొనుచుండిరి (అపొ. కా. 20:7; 1 కొరింథీ 16:2).

ఆయన సంఘానికి క్రొత్తనిబంధన దేవుని చట్టమై యున్నది!! దానికి మనం కలుపరాదు, దానినుండి తీసివేయరాదు, వేరొకదాన్ని ఉంచరాదు. లిఖింపబడిన వాక్యానికి లోబడునట్లు ఘనులు ఇతరులను నడిపింతురు (ప్రక 22:18, 19; 1 కొరింథీ 4:6; 2 యోహాను :9).

పవిత్ర క్రొత్తనిబంధన క్రైస్తవ్యాన్ని గూర్చిన విజ్ఞాపనను కొందరు హేళన చేతురు. ధైర్యముగలవారు ఆయన సత్యాన్ని నిలబెట్టాలని దేవుడు కోరుచున్నాడు. దేవుని వాక్యానికి లోబడుటయే నిత్య ప్రాముఖ్యాంశములను జరిగించుట యని జ్ఞాపక ముంచుకొనుము !!

— చార్ల్స స్కాట్.

---

Regd. No. H/KD—45/KD.H.O.

*From*
SATYA WAKKU
P.O. Box. 80
KAKINADA-533 001

To

..............................

..............................

..............................

..............................